



ఎన్నూరుకు చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

వేళచ్చేరిలో ప్రజలను రక్షించేందుకు సిద్ధంగా ఉంచిన పడవలు

ఈనాడు
తమిళనాడు

మంగళవారం అక్టోబరు 15, 2024

3 రోజులు భారీ వర్షాలకు అవకాశం

వాతావరణ పరిశోధన కేంద్రం

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై తదితర ఉత్తర జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. దక్షిణ బంగాళాఖాతంలోని అల్పపీడనం పశ్చిమ వాయువ్యదిశగా కదులుతోంది. మంగళవారంలోపు మధ్య దక్షిణ బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనంగా బలపడి, అనంతరం 48 గంటల్లో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ సముద్రతీరాల్లోకి పయనిస్తుందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. చెన్నై సహా సముద్రతీర జిల్లాల్లో ఆదివారం రాత్రి నుంచి భారీవర్షాలు కురుస్తున్నాయి. 15న చెన్నై, తిరువళ్లూరు,, కాంచీపురం, చెంగల్పట్టు, రాణిపేట, తిరువణ్ణామలై, కళ్లకురిచ్చి, కడలూరు జిల్లాల్లో. పుదుచ్చేరిలో ఒకటి రెండు చోట్ల భారీ నుంచి అతి భారీవర్షం కురిసే అవకాశం ఉంది. వేలూర్, తిరుపత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, ఈరోడు, అరియలూరు, పెరంబలూరు, తంజావూరు, తిరువారూరు, నాగపట్టిణం, మైలాడుతురై, కారైక్కల్‌లో భారీవర్షాలు, 16న చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీవర్షాలు కురవనున్నాయి. రాణిపేట, తిరువణ్ణామలై, విళుపురం జిల్లాలు, పుదుచ్చేరిలో భారీ నుంచి అతి భారీవర్షం. వేలూర్, తిరుపత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, కళ్లకురిచ్చి, కడలూరు జిల్లాల్లో భారీవర్షం పడే వీలుందని తెలిపింది. 15, 16 తేదీల్లో చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు తదితర ఉత్తర జిల్లాల్లో 20 సెం.మీ.కు పైగా వర్షపాతం నమోదవుతుందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. 17న తిరువళ్లూరు, రాణిపేట, వేలూర్, తిరుపత్తూరు, కృష్ణగిరి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షం, చెన్నై, కాంచీపురం, తిరువణ్ణామలై, ధర్మపురి, సేలం, ఈరోడు జిల్లాల్లో భారీవర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. 17 వరకు తమిళనాడు సముద్రతీర ప్రాంతాలు, బంగాళాఖాతంలో గంటకు 35 నుంచి 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని జాలర్లు చేపల వేటకు వెళ్లకూడదని హెచ్చరించింది.

పునరావాస శిబిరాలుగా పాఠశాలలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వాతావరణ మార్పుల కారణంగా వర్షాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి సూచించారు. ఈశాన్య రుతుపవనాల వర్షాలను ఎదుర్కొనేందుకు ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం ముఖ్యమంత్రి నేతృత్వంలో సోమవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. వర్షాలతో కలిగే నష్టాలు అరికట్టేందుకు, అన్ని శాఖలు సన్నద్ధమవ్వాలన్నారు. నీటి వనరులు, కాలువల్లో పూడిక తీయాలన్నారు. బాధిత ప్రజల కోసం పునరావాస శిబిరాలుగా పాఠశాలల భవనాలు సరైన స్థితిలో ఉన్నాయా లేదా అని పరిశీలించాలన్నారు. అవసరమైన మందులు నిల్వ ఉంచాలనిసూచించారు. 24 గంటలు అన్ని శాఖలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లు అందుబాటులో ఉండాలన్నారు.



సమీక్ష సమావేశంలో పుదుచ్చేరి సీఎం రంగసామి, మంత్రులు తదితరులు

వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పీకర్ సెల్వం, ప్రజా పనులశాఖ మంత్రి లక్ష్మి నారాయణన్, వ్యవసాయశాఖ మంత్రి జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు వేగవంతం: సీఎస్

ఆర్కేనగర్: భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు ముమ్మరం చేయాలని కలెక్టర్లు, పోలీసు అధికారులకు ప్రధానకార్యదర్శి మురుగానందం ఆదేశించారు. ఆయన పంపిన లేఖలో.. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వ, రాకపోకలకు అంతరాయం, కొండచరియలు విరిగిపడటం తదితర వాటిని ఎదుర్కోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

సర్వం సిద్ధం చేయండి

ముఖ్యమంత్రి స్టాలిన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. పలు ప్రాంతాల్లో భారీ, అతిభారీ వర్షాల హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో సోమవారం సమీక్ష సమావేశం సచివాలయంలో జరిగింది. జిల్లా కలెక్టర్లు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు. ప్రజల భద్రత నిమిత్తం స్టాలిన్ పలు ఆదేశాలు జారీ చేశారు.



సమావేశంలో సీఎం స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్, ఉన్నతాధికారులు

■ 15న చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో పాఠశాల, కళాశాలలకు సెలవు ప్రకటించాలి. 15 నుంచి 18 వరకు సాఫ్ట్‌వేర్ కంపెనీలు తమ ఉద్యోగులను ఇంటి నుంచే పనిచేయాలని ఆదేశించాలి.

■ జాతీయ విపత్తు నిర్వహణ, తమిళనాడు బృందాలను ప్రభావిత ప్రాంతాలకు పంపించాలి. వరద ప్రభావిత ప్రాంతాల్లో పడవలు సిద్ధం చేయాలి. జిల్లా పర్యవేక్షణ అధికారులు అక్కడి యంత్రాంగం సహకారంతో సన్నాహక పనులు, పునరుద్ధరణ, సహాయక చర్యలు చేపట్టాలి.

■ ప్రజల సౌకర్యార్థం మెట్రో, ఎలక్ట్రికల్ రైళ్ల సేవల సంఖ్య పెంచాలి. ఆహారశాఖ ద్వారా అత్యవసర వస్తువుల ధరలు పెరగకుండా కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టాలి. అంతరాయం లేకుండా ఆవిన్ సంస్థ ద్వారా పాలు, పాల ఉత్పత్తుల వినియోగం కొనసాగించాలి. నిర్వాసితులు, వృద్ధాశ్రమాల్లో తగిన ఆహార వస్తువులు నిల్వ ఉంచుకోవాలని సూచించాలి.

■ పునరావాస శిబిరాలు సిద్ధం చేయడంతోపాటు ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను ముందుగానే తీసుకొచ్చి శిబిరాల్లో ఉంచాలి. రొట్టె, తాగునీటి సీసాలను పునరావాస కేంద్రాల్లో పెట్టాలి. వైద్య సదుపాయాలు, దివ్యాంగులకు చక్రాల కుర్చీలు ఏర్పాటు చేయాలి.

■ వర్షాలకు ట్రాఫిక్ రద్దీ ఏర్పడితే ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేయాలి. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూసుకోవాలి. కంట్రోల్ రూమ్‌లలో అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలి.

■ ముత్తుక్కాడు, బకింగ్‌హామ్ కాలువ, కళ్లియార్ కరుణానిధి వంతెన డ్రైనేజీ అడ్డంకులు తొలగించేందుకు తగినన్ని యంత్రాలను ఉంచుకోవాలి. డ్యామ్‌లలో నీటి ప్రవాహం, వర్షపాతం నిరంతరం పర్యవేక్షించాలి. ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చేలా చూడాలి. అంతరాయం లేకుండా తాగునీటి సరఫరాకు జనరేటర్లు ఉంచుకోవాలి. ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

జిల్లాలను పట్టించుకోరా?: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై మాత్రమే తమిళనాడు కాదని, ఇతర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుంటే డీఎంకే ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిసామి ఆరోపించారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. భారత వాతావరణ కేంద్ర హెచ్చరికల మేరకు జిల్లాల్లో కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. అక్కడ ఎలాంటి సహాయ చర్యలు డీఎంకే ప్రభుత్వం చేపట్టలేదని ఆరోపించారు. చెన్నై మాత్రమే తమిళనాడు అనే భావనలో ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఉన్నారని విమర్శించారు. రెండు రోజులుగా కోయంబత్తూరు, సేలం, పుదుకోట్టై తదితర జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయన్నారు. విద్యుత్ తీగలు తెగిపడి ప్రాణనష్టం కూడా జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం మేల్కొని వర్షాల నుంచి ప్రజలను రక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రూప్-4 ఖాళీలు పెంచాలి: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: గ్రూప్-4 ఖాళీలను 15 వేలకు పెంచాలని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఇటీవల జరిగిన టీఎన్‌పీఎస్సీ గ్రూప్-4 పరీక్ష ద్వారా ఎంపిక చేసే ఉద్యోగుల సంఖ్య 15 వేలకు పెంచాలని అభ్యర్థులు డిమాండ్ చేశారని తెలిపారు. ఖాళీలను 2,208 మాత్రమే పెంచుతూ టీఎన్‌పీఎస్సీ ప్రకటన విడుదల చేయటం నిరాశ కలిగించిందన్నారు. యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించటంలో రాష్ట్ర ప్రభుత్వ తీరు ఖండించదగిందన్నారు. ఖాళీల సంఖ్య 15 వేలకు పెంచేందుకు టీఎన్‌పీఎస్సీ ముందుకు రావాలని డిమాండ్ చేశారు.

నీరు నిలవకుండా చర్యలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వర్షపునీరు నిలవకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ నిర్వహణశాఖ మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో మంత్రి పాత వన్నారపేట, పెరంబూర్ సౌరంగమార్గం తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం పరిశీలించారు. రిప్పన్‌భవనం ప్రాంగణంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, ప్రజల ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. గత అనుభవంతో ఈసారి పనిచేస్తున్నామన్నారు. పునరావాస శిబిరాల్లో పాలు, బిస్కెట్ తదితర వాటిని ఉంచామన్నారు. వైద్యపరికరాలు, నీటిని తొలగించే యంత్రాలు సిద్ధం చేశామని చెప్పారు. 990 ప్రాంతాల్లో నీటిని తోడే మోటార్లు పెట్టామన్నారు. కార్పొరేషన్ సిబ్బంది 24గంటలు షిఫ్ట్ పద్ధతిలో విధుల్లో ఉండాలన్నారు. మెట్రో, రైల్వే వంతెన పనులలో వర్షపునీరు నిలిచి ముప్పు ఉందని గుర్తు చేశారు.



తండయారుపేట ప్రాంతంలో ముందస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ





విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం ● రామ్‌నగర్ వంతెనపై నిలిపిన కార్లు

చెన్నైలో 300 లోతట్టు ప్రాంతాలు గుర్తింపు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి మురుగానందం చెన్నై ఎళిలగంలోని అత్యవసర కార్యకలాపాల పర్యవేక్షణ కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మంగళవారం అతి భారీవర్షాలకు అవకాశాలు ఉన్నాయని మంగళవారం చెన్నై చుట్టుపక్కల జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ఇచ్చామన్నారు. మిగిలిన జిల్లాలో సెలవులపై ఆయా జిల్లాల కలెక్టర్లే నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ముఖ్యప్రాంతాలకు జాతీయ విపత్తు నిర్వహణ బృందాలను పంపినట్లు చెప్పారు. చెన్నైలో పడవలు సిద్ధంగా ఉంచామన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. చెన్నై వ్యాప్తంగా 300 లోతట్టు ప్రాంతాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల వాసులు వేళచ్చేరి రామనగర్ వంతెనపై కార్లు నిలిపి ఉంచారు. గతంలో ఎక్కడెక్కడ నీరు నిలిచిందో అక్కడ తొలగింపునకు మోటార్లు సిద్ధం చేశామన్నారు. మెట్రో పనులతో అక్కడక్కడా తవ్విన గుంతలు మూసివేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. చెరువుల్లో నీటిమట్టం పరిశీలించామని చెప్పారు.

36 గంటల్లో..

● కవరైపెట్టై వద్ద పూర్తిస్థాయి రాకపోకల పునరుద్ధరణ

● ఒక్క రోజులోనే ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే రైళ్లకు అవకాశం

● రికార్డు స్థాయిలో సహాయక చర్యలు

కవరైపెట్టై రైలు ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడ్డ కోచ్‌లను చూస్తే.. ఈ మార్గంలో రాకపోకలు ఎప్పుడో అన్న అనుమానం అక్కడివారికి కలిగింది. రికార్డు సమయంలో దక్షిణ రైల్వే, ఇతర శాఖలు విభాగాలు పునరుద్ధరించాయి.

ఈనాడు–చెన్నై

మైసూరు నుంచి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మీదుగా దర్భాంగ వెళ్లే భాగమతి ఎక్స్‌ప్రెస్ తిరువళ్లూరు జిల్లా కవరైపెట్టై స్టేషన్ సమీపంలో గూడ్స్‌రైలును ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ మార్గం పూర్తిగా స్తంభించడంతో 20 రైళ్లు రద్దుచేశారు. మరో 60 రైళ్లను దారి మళ్లించడం, సమయాలు మార్చడం లాంటివి చేశారు. చెన్నై- గుమ్మిడిపూండి మీదుగా వెళ్లే సబర్బన్ రైళ్లను పూర్తిగా రద్దుచేశారు. అటువైపుగా గుమ్మిడిపూండి-సుళ్లూరుపేట మధ్య మాత్రమే నడిచేలా చేశారు. ఓ పక్క ప్రయాణికుల బాగోగులు, మరోపక్క పట్టాలపై సహాయక చర్యలకు యుద్ధప్రాతిపదికనే యంత్రాంగాలు కదలాల్సి వచ్చింది.





ఘటనాస్థలంలో యుద్ధప్రాతిపదికన పనులు ● చెన్నై–గుమ్మిడిపూండి మీదుగా రాకపోకలు సాగిస్తున్న సబర్బన్ రైలు – న్యూస్‌టుడే, గుమ్మిడిపూండి

అరగంటకే పని మొదలు..

జాతీయ విపత్తు నిర్వహణ దళం(ఎన్డీఆర్ఎఫ్)తోపాటు తమిళనాడు ఫైర్, రెస్క్యూ దళాలు, దక్షిణ రైల్వే సిబ్బంది.. ఇలా మొత్తం 500మందికి పైగా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. స్థానికులతో కలిసి పోలీసులు హుటాహుటిన చేరుకున్నారు. ఫైర్, రెస్క్యూ సిబ్బంది కోచ్‌ల్లో ఇరుక్కుపోయిన ప్రయాణికుల్ని బయటికి తీశారు. పట్టాలపై చెల్లాచెదురుగా ఉన్న కోచ్‌లు తీయడానికి 5 భారీ ఎర్త్ మూవర్స్, 3 జేసీబీలు, 140 టన్నుల సామర్థ్యంతో బరువుల్ని ఎత్తే క్రేన్‌లను ఘటనాస్థలికి తెచ్చారు. శుక్రవారం రాత్రి 8.30కు ప్రమాదం జరిగితే.. అరగంటలో సహాయక చర్యలు మొదలయ్యాయి.

కేవలం 10 కి.మీ వేగంతో..

చెదిరిన రైలు పట్టాల్ని సాధారణస్థితికి తెచ్చేందుకు అలసిపోకుండా శ్రమించాల్సి వచ్చింది. రైలింజన్, పవర్‌కార్‌తో పాటు మొత్తం 12 కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఇందులో 9 ఏసీ కోచ్‌లున్నాయి. మరోవైపు గూడ్స్‌రైలుకు చెందిన రెండు వ్యాగన్లూ పట్టాలమీద పడ్డాయి. రైల్వే అధికారులు తెచ్చిన ప్రత్యేక యంత్రాలతో వాటిని తొలగించారు. ప్రమాదం జరిగిన 24గంటల్లో ఈ మార్గంలో రైళ్లు తిరిగేలా చేయడం రికార్డుగా దక్షిణ రైల్వే చెబుతోంది. తొలి రైలును చెన్నైవైపు పంపారు. 24గంటల్లో అప్‌లైన్‌ను అందుబాటులోకి తీసుకురాగా, డౌన్‌లైన్‌ను ఆ తర్వాతి 12 గంటల్లోనే సిద్ధం చేశారు. శనివారం ఉదయం నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా రైళ్లు వెళ్తున్నాయి. ప్రస్తుతం ఈ మార్గంలో వేగాన్ని తగ్గించి రైళ్లను అనుమతిస్తున్నారు. చెన్నై, గుమ్మిడిపూండి మధ్య ఈఎంయూ రైళ్లు ఆదివారం ఉదయం నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ఘటనాస్థలంలో పరిసరాల్లో గంటకి కేవలం 10 కి.మీ. వేగంతో రైళ్లు నడుస్తున్నాయి.

8 గంటల్లో కదిలిన ప్రయాణికులు

కవరైపెట్టై నుంచి పొన్నేరి స్టేషన్ వరకు ప్రయాణికులను బస్సుల్లో తరలించి.. అక్కడి నుంచి చెన్నై సెంట్రల్‌కు ప్రత్యేక ఈఎంయూ రైల్లో తీసుకెళ్లారు. కావాల్సిన ఆహారం, నీటి సదుపాయం కల్పించారు. ప్రయాణంపై బాధితులు ఆందోళన చెందుతున్న సమయంలో కేవలం 8 గంటల వ్యవధిలోనే అదే మార్గంలో ప్రత్యేక రైలు ఏర్పాటు చేయడంపై ప్రశంసలు వెలువెత్తుతున్నాయి. ఇందులో 1,800 మంది ప్రయాణికులు వెళ్లారు.

ఏడుగురికి పరిహారం అందజేత

రైలు ప్రమాదంలో గాయపడి తీవ్ర గాయాలతో ఉన్న ముగ్గురు ప్రయాణికులు చెన్నైలోని స్టాన్లీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారు కోలుకుంటున్నట్లు రైల్వే అధికారులు వివరించారు. వారితో పాటు ఇతర ఆసుపత్రిలో చికిత్స పొందిన మొత్తం ఏడుగురికి దక్షిణ రైల్వే నిబంధనల ప్రకారం పరిహారం అందజేసినట్లు అధికారులు ప్రకటించారు. వారంతా ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారుగా చెప్పారు.

రంగంలోకి ఫోరెన్సిక్ నిపుణులు

పట్టాలపై వేలిముద్రల సేకరణ

ఈనాడు–చెన్నై: కవరైపెట్టై రైలు ప్రమాదంపై దర్యాప్తు ముమ్మరం చేశారు. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు సైతం ఘటనాస్థలంలో పలుకోణాల్లో పరిశీలన చేస్తున్నారు. పట్టాలకు బోల్టులు, నట్లు తొలగించడంపైనే ఎక్కువ అనుమానం ఉండటంతో.. ఫోరెన్సిక్ నిపుణుల్ని సైతం పిలిపించారు. పట్టాల సమీపంలో వేలిముద్రల నమూనాలు, ఇతర ఆధారాల్ని సేకరించారు. మరోవైపు రైల్వే పోలీసు అధికారులు సైతం దర్యాప్తులో వేగం పెంచారు. ఈ విభాగం నుంచి ముగ్గురు డీఎస్పీ స్థాయి అధికారుల్ని విచారణకోసం నియమించారు. వారి ఆధ్వర్యంలో 3 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఒక్కో బృందంలో 8మంది అధికారులున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే పలువురు రైల్వే సిబ్బందికి సమన్లు పంపారు. మరోవైపు ఘటనాస్థలంలో దొరికిన ఆధారాలు, ప్రధానంగా సీసీ ఫుటేజీలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

ఆధారాలుంటే ఇవ్వండి

మెయిన్‌లైన్‌పై వెళ్లాల్సిన భాగమతి ఎక్స్‌ప్రెస్ లూప్‌లైన్‌లోకి వెళ్లడమే ప్రమాదానికి అసలు కారణమని చెబుతూ.. పట్టాల వ్యవస్థను ట్యాంపరింగ్ చేయడంతో ఘటన జరిగి ఉంటుందనే ఓ అనుమానాన్ని రైల్వే అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఈ కోణంలోనూ ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నటు వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన ఏవైనా ఆధారాలు ప్రజల దగ్గరుంటే కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ దర్యాప్తు అధికారులకు సమర్పించాలని చెబుతున్నారు. చెన్నై పార్క్‌టౌన్‌లోని డీఆర్ఎం కార్యాలయంలో వారు అందుబాటులో ఉంటారని వివరించారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించడమే లక్ష్యం

సైదాపేట, న్యూస్‌టుడే: ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించి శిక్షణ ఇవ్వటమే ముఖ్యమంత్రి కప్ క్రీడా పోటీల లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. సోమవారం చెన్నై నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగే సీఎం కప్-2024లో రాష్ట్రస్థాయి జూడో పోటీలను ప్రారంభించారు. 52 కిలోల విభాగంలో కళాశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీని తిలకించి విజేతలకు పతకాలు అందించారు. క్రీడాకారులకు ఆహారం తయారు చేసే వంటశాలను పరిశీలించారు. ఆహార నాణ్యత, క్రీడాకారుల గదుల్లో వసతులు, రవాణా సౌకర్యాలపై క్రీడాకారులను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సీఎం కప్-2024 పోటీలకు రూ. 83.37 కోట్లను ముఖ్యమంత్రి స్టాలిన్ కేటాయించారని తెలిపారు. ఈ ఏడాది 36 రకాల పోటీల్లో 12 లక్షల మంది క్రీడాకారులు బరిలోకి దిగుతున్నారని చెప్పారు. యువజన సంక్షేమ, క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ కార్యదర్శి అతుల్య మిశ్ర, క్రీడాభివృద్ధి కమిషన్ సభ్య కార్యదర్శి మేఘనాథ్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



క్రీడాకారిణులతో కలిసి భోజనం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

నవంబరు 23న చెన్నై చేరుకోనున్న అన్నామలై

సైదాపేట, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నవంబరు 23న చెన్నైకి తిరిగి రానున్నట్లు సమాచారం. అంతర్జాతీయ రాజకీయ కోర్సు పూర్తిచేసేందుకు అన్నామలై పార్టీ అధిష్ఠానం సూచనతో లండన్ వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అక్కడ కోర్సు పూర్తి చేయడంపై ఆయన దృష్టిసారించారు. ఆయన రాష్ట్రంలో లేకపోవడంతో తమిళనాడు పార్టీ వ్యవహారాలు చూసుకునేందుకు సీనియర్ నేత హెచ్.రాజా నేతృత్వంలో సమన్వయ కమిటీ ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో నవంబర్ 23న అన్నామలై చెన్నైకి తిరిగి రానున్నట్లు తెలుస్తోంది. మళ్లీ వచ్చే ఏడాది కోర్సు సర్టిఫికెట్ పొందేందుకు లండన్ వెళ్తారని సమాచారం. అన్నామలై వచ్చిన తర్వాత పార్టీలో పలు మార్పులు జరిగే అవకాశం ఉందని, జిల్లా కార్యదర్శులను మార్చనున్నట్లు చర్చ నడుస్తోంది. అలాగే యువతకు పదవులు కట్టబెట్టేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

పది, ప్లస్‌వన్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల తేదీలు విడుదల

కోయంబత్తూర్, రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వచ్చే ఏడాది మార్చి 3 నుంచి 25వ తేదీ వరకు ప్లస్‌టూ, మార్చి 5 నుంచి 27వ తేదీ వరకు ప్లస్‌వన్ పబ్లిక్ పరీక్షలు, మార్చి 28 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ పొయ్యామొళి పేర్కొన్నారు. ఆయన కోయంబత్తూరు కలెక్టర్ కార్యాలయంలో పరీక్షల జాబితాను సోమవారం విడుదల చేశారు.

ప్లస్‌టూ పరీక్షలు ఇలా..

మార్చి 3 - తమిళం, 6 - ఆంగ్లం, 13 - గణితం, జువాలజీ, కామర్స్, మైక్రో బయాలజీ, అగ్రికల్చర్ సైన్స్, 14 - కంప్యూటర్ సైన్స్, అడ్వాన్స్డ్ లాంగ్వేజ్, పొలిటికల్ సైన్స్, స్టాటిస్టిక్స్, 18 - బయాలజీ, బోటనీ, హిస్టరీ, 21 - కెమిస్ట్రీ, అకౌంటెన్సీ, జియోగ్రఫీ, 25 - ఫిజిక్స్, ఎకనామిక్స్.

ప్లస్‌వన్..

మార్చి 5 - తమిళం, 10 - ఆంగ్లం, 13 - అడ్వాన్స్డ్ లాంగ్వేజ్, 17 - బయాలజీ, బోటనీ, హిస్టరీ, 20 - ఫిజిక్స్, ఎకనామిక్స్, 24 - గణితం, జువాలజీ, కామర్స్, 27 - కెమిస్ట్రీ.

పదో తరగతి...

మార్చి 28 - తమిళం, ఏప్రిల్ 2 - ఇంగ్లిష్, 4 - ఆప్షనల్ లాంగ్వేజ్, 7 - గణితం, 11 - సైన్స్, 15 - సోషల్ సైన్స్ నిర్వహించనున్నారు.

● ప్లస్‌టూ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 7 నుంచి 14 వరకు, ప్లస్‌వన్‌కు ఫిబ్రవరి 15 నుంచి 21వ తేదీ వరకు, పదో తరగతికి ఫిబ్రవరి 22 నుంచి 28వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి.

● ప్లస్‌టూ ఫలితాలు మే 9న, ప్లస్‌వన్, పదో తరగతి ఫలితాలు మే 19న వెలువడనున్నాయి.



పరీక్షల షెడ్యూల్ విడుదల చేస్తున్న మంత్రి అన్బిల్ మహేశ్

వర్సిటీపై గవర్నర్‌కు విద్యార్థి ఫిర్యాదు



ప్రకాష్

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోవై భారతియార్ విశ్వవిద్యాలయంలో 39వ స్నాతకోత్సవం సోమవారం నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి అధ్యక్షత వహించి విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఆ సమయంలో ప్రకాష్ అనే విద్యార్థి పట్టా పొందిన అనంతరం గవర్నర్‌కు ఓ ఫిర్యాదుపత్రం అందజేశాడు. అందులో.. వర్సిటీలోని హాస్టల్ గదుల్లో మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని, గైడ్లు అందజేసేందుకు అధ్యాపకులు విద్యార్థులను బెదిరించి రూ.వేలల్లో డబ్బులు గుంజుతున్నారని, క్రీడా పోటీల నిర్వహణ పేరుతో రకరకాల ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించాడు.

రవాణాశాఖలో 24×7 హెల్ప్‌లైన్

వడపళని, న్యూస్‌టుడే: ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణికులకు సేవలను మరింత మెరుగుపరిచే దిశగా రవాణాశాఖ సిద్ధమైంది. ఫిర్యాదుల పరిష్కారానికి సహాయక డెస్క్(ఐపీజీఆర్‌హెచ్) అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఆలోచనలు ప్రారంభించింది. ఈ సంవత్సరం రోజుకు సగటున 573 రకాల ఫిర్యాదులు అందుతున్నాయి. వాటిని తీర్చేందుకు ప్రత్యేకసెల్ ఏర్పాటు చేసి సామాజిక మాధ్యమాల ద్వారా స్పందన తెలుసుకుంటోంది. సిబ్బంది పని తీరు, విద్యార్థులు ఫుట్‌బోర్డుపై ప్రయాణాలు, బస్సుల నిర్వహణ, కిళాంబాక్కం కేసీబీటీలో అందుతున్న సేవలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తున్నాయి. స్టాపుల్లో ఆగకుండా వెళ్లడం, కండక్టర్ల నుంచి చిల్లర ఇవ్వకపోవడాన్ని కూడా ప్రయాణికులు ప్రస్తావిస్తున్నారు.

వాట్సాప్‌తో అనుసంధానిస్తే..

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టాలనుకుంటున్న 24×7 హెల్ప్‌లైన్ నెంబరు 149ను వాట్సాప్, ఈమెయిల్‌తో అనుసంధానం చేస్తే బాగుంటుందని పలువురు అంటున్నారు. ఇందుకోసం పల్లవన్ ట్రాన్స్‌పోర్ట్ కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(పీటీసీఎస్ఎల్) టెండరు కూడా ఆహ్వానించింది. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ అన్ని రకాల నిర్వహణ పనులను మూడేళ్లపాటు చూసుకోవాల్సి ఉంటుంది.

చిరుధాన్యాల సాగుకు రాయితీ



విల్లివాక్కం, న్యూస్‌టుడే: చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచడానికి ప్రభుత్వం రూ.65 కోట్ల రాయితీ ప్రకటించింది. నిలకడైన ఆదాయం దృష్ట్యా రైతులు ఎక్కువమంది సాగుకు ఆసక్తి చూపుతున్నారు. గతేడాది కేటాయించిన రాయితీతో 1.11 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. 2028 వరకు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. చిరుధాన్యాల సాగు ఉద్యమాన్ని 25 జిల్లాలో ప్రారంభించినట్టు వ్యవసాయాధికారి ఒకరు చెప్పారు. రైతుల బృందాన్ని ఏర్పాటు చేయడానికి రూ.1,000, చిరుధాన్యం ప్యాకేజి రూపొందించడానికి షెడ్యూల్డ్ తెగల రైతులకు ఎకరాకు రూ.840, ఇతరులకు రూ.600 రాయితీ ఇస్తామన్నారు. సహజ ఎరువుల కొనుగోలుకు ఎకరాకు రూ.480 అందిస్తున్నట్లు వివరించారు. అవసరమైన రైతులు 'ఉళవన్' యాప్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు.

పూడికతీత పనుల పరిశీలన



పరిశీలనకు వెళ్తున్న ఉదయనిధి, మంత్రి అన్బరసన్ తదితరులు

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెన్నై సమీప ముట్టుక్కాడులో వరదనీరు సముద్రంలో కలిసేచోట పూడిక తీసే పనులను ఆదివారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మంత్రి టీఎం అన్బరసన్, చెంగల్పట్టు జిల్లా కలెక్టరు అరుణ్‌రాజ్, ముఖ్య కార్యదర్శి ప్రతాప్ యాదవ్, గ్రేటర్ చెన్నై కమిషనర్ కుమరగురుభరన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయనిధి విలేకరులతో మాట్లాడుతూ... ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించిందని, ఆ మేరకు చెన్నై సహా చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూర్ జిల్లాల్లో చేపడుతున్న ముందస్తు జాగ్రత్త చర్యలపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. అందులో భాగంగా వరదనీరు సముద్రంలో కలిసే చోట డ్రెడ్జింగ్ పాయింట్‌లో చేపడుతున్న పూడికతీత పనులను పరిశీలించామని పేర్కొన్నారు. వర్షపు నీరు నిలవకుండా రూ.39 కోట్ల వ్యయంతో 180 పనులు చేపడుతున్నామని తెలిపారు. చెన్నై, శివారు ప్రాంతాల్లో సుమారు 200 కి.మీ దూరం వాననీటి కాలువల్లో పూడికతీసే పనులను ముమ్మరంగా చేపట్టామని వివరించారు. చెన్నై నగరంలోని ఓటేరి నల్లాన్, బకింగ్‌హాం, విరుగంబాక్కం, అరుంబాక్కం కాలువల్లో పూడిక తీసే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

విమాన సర్వీసులు పెంచాలి

వడపళని, న్యూస్‌టుడే: తిరుచ్చి-ధోహా మధ్య విమాన సర్వీసులు పెంచాలని ఖతార్‌లో ఉంటున్న నాన్ రెసిడెంట్ తమిళ్ ఇండియన్ అసోసియేషన్(ఎన్‌ఆర్‌టీఐఏ) కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖను విన్నవించింది. ప్రస్తుతం ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ వారంలో శుక్రవారం ఒకరోజు మాత్రమే నడుపుతోందని సంఘ అధ్యక్షుడు ఆర్.మదన్‌కుమార్ పేర్కొన్నారు. ఖతార్‌లో ఉన్న తమిళులు కొలంబో లేదా చెన్నై మీదుగా తిరుచ్చి వెళ్తున్నారని, బాగా వ్యయమవుతోందన్నారు. ఖతార్‌లో ఎన్నారైలు 8.3 లక్షల మంది ఉన్నారని, వారిలో 1.2 లక్షల మంది తమిళులని, తిరుచ్చి పరిసర జిల్లాల్లోని వారేనని పేర్కొన్నారు.

సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం



వర్ష ప్రభావ జిల్లాలకు వెళ్లేందుకు సిద్ధమైన జవాన్లు

అరక్కోణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 14 నుంచి 18వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో రాణిపేట జిల్లా అరక్కోణం సమీపం తక్కోళం నగరికుప్పం వద్ద ఉన్న జాతీయ విపత్తుల నిర్వహణ దళం (ఎన్డీఆర్ఎఫ్) సహాయక చర్యలకు సిద్ధమైంది. ఒక్కో బృందంలో 30 మంది చొప్పున పది బృందాలు అన్ని రకాల పరికరాలతో సిద్ధంగా ఉన్నారని, ఎన్డీఆర్ఎఫ్ నాలుగో బెటాలియన్ ఆవరణలో 24 గంటలపాటు అత్యవసర కంట్రోల్ సెంటర్ పనిచేస్తుందని, అదేవిధంగా జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఉన్న జాతీయ ప్రకృతి వైపరీత్యాల నివారణ సంస్థతో, తమిళనాడు రాష్ట్ర అత్యవసర కంట్రోల్ రూంతో సంబంధాలు కొనసాగుతున్నాయని, ప్రభుత్వ పిలుపు కోసం ఎదురుచూస్తున్నట్లు ఎన్డీఆర్ఎఫ్ నాలుగో బెటాలియన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు రాధాకృష్ణన్ నగర్, నోలంబూరు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు.

చెన్నైలో 5 చెరువుల నుంచి నీటి విడుదల

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాల నేపథ్యంలో ముందస్తు చర్యలుగా చెన్నైలోని ఆవడి, అయ్యప్పాక్కం, అంబత్తూర్, కొరట్టూర్, మాధవరం చెరువుల నుంచి నీరు విడుదల చేస్తున్నారు. వరద ముప్పును నివారించేందుకు 4 తూములు ఏర్పాటు చేశామని, వాటి నిల్వ సామర్థ్యం నుంచి సగానికి పైగా నీరు విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. నీరు విడుదల చేసినా ఆ చెరువులలో డిసెంబరు వరకు సగం నిండి ఉంటాయని పేర్కొన్నారు. గత సంఘటనల దృష్ట్యా, నీరు వేగంగా వెళ్లడానికి అదనంగా తూములు ఏర్పాటు చేశామన్నారు.

పురాతన మురుగన్ విగ్రహం గుర్తింపు



కాంచీపురం, న్యూస్‌టుడే: శిథిలస్థితిలో ఉన్న 7వ శతాబ్దపు మురుగన్ విగ్రహాన్ని కాంచీపురం సమీప ఒళుక్కోల్‌పట్టు గ్రామంలో గత వారం వాలాజాబాద్ తాలూకా చరిత్ర పరిశోధన కేంద్రం పరిశోధకులు గుర్తించారు. కేంద్రం అధ్యక్షుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. మహాలక్ష్మీ ఆలయ సమీపంలో గుర్తించిన విగ్రహం ముఖం, చెవుల్లో ఆభరణాలు ధరించినట్లు చెక్కారు. నడుముకు ధోవతి, కుడి చేతిలో ఆయుధం ఉందని తెలిపారు. సరైన భద్రత, లేకపోవడంతో రూపురేఖలు మారిపోయాయన్నారు. పురావస్తుశాఖ విగ్రహాన్ని పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

24 గంటలు విధుల్లో జీసీసీ సిబ్బంది

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాల వర్షాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా చెన్నై మహానగర కార్పొరేషన్‌లో ఉద్యోగులు 24 గంటలు విధుల్లో ఉండటాన్ని నిర్ధారించాలని కార్పొరేషన్ కమిషనర్ కుమరగురుభరన్ అధికారులను ఆదేశించారు. 21 వేలమంది ఉద్యోగులు 24 గంటలపాటు షిఫ్టుల విధానంలో విధుల్లో ఉండాలన్నారు.

నగరీశ్వర ఆలయ కుంభాభిషేకం 21న

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం బస్టాండు సమీపం తూర్పు రాజావీధిలోని నగరీశ్వర ఆలయంలో పునరుద్ధరణ పనులు ఇటీవల ముగిశాయి. ఈ నేపథ్యంలో మహా కుంభాభిషేకం 21న నిర్వహించనున్నారు. 18 నుంచే పూజలు మొదలవనున్నాయి.

కాంచీపురంలో బాల్య వివాహాలు: 19 మందిపై కేసు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లాలో బాల్య వివాహాలు నిర్వహించిన వారిపై 19 కేసులు నమోదు చేసినట్లు కలెక్టరు కలైసెల్వి తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో.. బాల్య వివాహాలకు సంబంధించి ఈ సంవత్సరం ఇప్పటివరకు 19 ఫిర్యాదులు అందాయని తెలిపారు. 15 పెళ్లిళ్లను అడ్డుకొన్నామని, 4 జరిగిపోయాయని తెలిపారు. ఆ వివాహాలపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే 1098, 181కు ఫోన్ చేసి తెలియజేయొచ్చన్నారు. ఫిర్యాదు చేసే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బాల్య వివాహాలు ప్రోత్సహించే వారికి రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

2026 ఎన్నికల్లో డీఎంకే కూటమి కనుమరుగు: తమిళిసై

ప్యారిస్, న్యూస్‌టుడే: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి కొనసాగదని మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ విమర్శించారు. మదురై విమానాశ్రయంలో ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... వరదల నుంచి ప్రజలను రక్షించడంతోపాటు, చెరువుల్లో పూడికతీసి నీటిని నిల్వ చేయాలని తెలిపారు. డీఎంకే ప్రభుత్వం చెన్నై, మదురై, తిరుచ్చి తదితర జిల్లాల్లో వర్షాకాల ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడంలో విఫలమైందన్నారు. ఉదయనిధి వార్‌రూమ్‌లో కూర్చుని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎయిర్ షో సమయంలో సంభవించిన మరణాలను రాజకీయంగా చూడకూడదని చెబుతున్నారని, కానీ డీఎంకేనే రాజకీయాలు చేస్తోందన్నారు. డీఎంకే కూటమి పార్టీలు అందుకు వ్యతిరేకంగా ఉన్నాయని తెలిపారు. 2026 ఎన్నికల్లో కచ్చితంగా డీఎంకే కూటమి ఉండదన్నారు.

విద్యార్థుల భద్రతకు చర్యలు అవసరం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అతి భారీవర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ అయిన నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కన్నప్పన్ సోమవారం అన్ని జిల్లాల ప్రధాన విద్యాధికారులకు ముందస్తు జాగ్రత్త చర్యల గురించి సర్క్యులర్ పంపారు. అందులో... పాఠశాలల్లో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ కనెక్షన్లపై నిఘా ఉంచాలన్నారు. డ్రైనేజీలను తప్పనిసరిగా మూసి ఉంచాలని, పాఠశాలలోని చెట్ల కొమ్మలను కత్తిరించి తొలగించాలన్నారు. ప్రహరీలపై నిఘా ఉంచాలన్నారు. దెబ్బతిన్న గోడల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని, తరగతి గదులు, మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరితే ఉపయోగించకుండా తాళాలు వేయాలని తెలిపారు. విద్యార్థులు పాఠశాలల నుంచి బయటకి వెళ్లకుండా చూడాలని సూచించారు. వర్షాకాల వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

విద్యుత్తు మరమ్మతులకు ప్రత్యేక నెంబర్

వడపళని, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వర్షాలు మొదలైన నేపథ్యంలో గృహాలలోని ఎలక్ట్రికల్ వస్తువులేవైనా పాడైతే వెంటనే విద్యుత్తు బోర్డు కార్యాలయాన్ని 94987 94987 నెంబరుపై సంప్రదించి ఫిర్యాదు చేయాలని 'టాన్‌జెడ్కో' సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

వాహనాలు నీట మునకుండా..

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నైలో అతి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం హెచ్చరికలు జారీచేయడంతో వేళచ్చేరి పైవంతెనపై ప్రజలు తమ వాహనాలను పార్క్ చేయడం ప్రారంభించారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు, వాహనాలు నీటమునగడంతో ఈసారి వాహనదారులు జాగ్రత్త పడ్డారు. సోమవారం నుంచే వేళచ్చేరి చుట్టుపక్కల ప్రాంతాల్లోని వారు తమ కార్లను పైవంతెనపై పార్క్ చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉంది.

జాలర్ల వలలు ధ్వంసం

ప్యారిస్, న్యూస్‌టుడే: శ్రీలంక నావికాదళం ఆగడాలకు అడ్డుకట్ట పడటంలేదు. శ్రీలంక జైల్లో ఉన్న రాష్ట్ర జాలర్లను విడుదల చేయాలని రామేశ్వరం మత్స్యకారులు 12 రోజులు సమ్మె చేపట్టారు. అనంతరం విరమించి శనివారం 2,500 మందికిపైగా సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున కచ్చతీవు వద్ద చేపలు పడుతున్న జాలర్లను గస్తీ పడవలో వచ్చిన శ్రీలంక నావికాదళం.. సరిహద్దులు దాటి వచ్చారని, వెంటనే వెళ్లిపోవాలని హెచ్చరించింది. వలలను ధ్వంసం చేయడంతో జాలర్లు భయంతో తీరానికి చేరుకున్నారు.

20న డిస్లెక్సియా అవేర్‌నెస్ వాక్

వడపళని, న్యూస్‌టుడే: మద్రాస్ డిస్లెక్సియా అసోసియేషన్(ఎండీఏ) ఆధ్వర్యంలో 20న అవేర్‌నెస్ వాక్ జరగనుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్(ఐఐటీఎం) పూర్వ విద్యార్థి, పురస్కార గ్రహీత డి.చంద్రశేఖర్ ఎండీఏ స్థాపించి టీచర్లకు, ప్రత్యేక విద్యానిపుణులకు గత 30 ఏళ్లుగా శిక్షణ అందిస్తున్నారు. ఆ రోజు ఉదయం బెసెంట్‌నగర్ బీచ్‌లో అవేర్‌నెస్ వాక్ 7 గంటలకు ప్రారంభమవుతుందని నిర్వాహకులు సోమవారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు వృద్ధుల నుంచి కళలు, కథలు చెప్పడం, వక్తృత్వ పోటీలు, నృత్యం, సంగీతం వంటి పోటీలుంటాయన్నారు. ఆన్‌లైన్‌లో వివిధ రకాల ప్రిలిమనరీ పోటీల్లో 1,000 మందికిపైగా పాల్గొన్నారు. ఇందులో అర్హులైన వారికి తుది పోటీలు 16న టీనగర్ ఓబుల్‌రెడ్డి హాలు, శ్రీ త్యాగబ్రహ్మ గానసభ-వాణి మహల్, 17న టీఏజీ హాలు, 18న టీనగర్ దండపాణి వీధిలోని శ్రీ ఆర్కేం బాలుర మహోన్నత పాఠశాలల్లో జరుగుతాయని పేర్కొన్నారు.

టీవీకే మహానాడుకు అదనంగా స్థలం ఎంపిక

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) మొదటి రాష్ట్ర మహానాడును ఈనెల 27న విళుపురం జిల్లా విక్రవాండి సమీప వి.సాలైలో నిర్వహించడానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ నేతృత్వంలో వేదిక నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పాల్గొనేవారి వాహనాలు నిలపడానికి తగినంత స్థలం కేటాయించాలని పోలీసులు నిర్వాహకులకు సూచించారు. ఆ మేరకు 27 ఎకరాలను మూడుచోట్ల కేటాయించారు. ఆ స్థలం సరిపోదని పోలీసులు తెలపడంతో అదనంగా రెండు ప్రాంతాల్లో 50 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు నిర్వాహకులు తెలిపారు.

తోలు వస్తువులకు 'లెదర్ మార్క్'

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చర్మ ఉత్పత్తుల విక్రయం, ఎగుమతులను పెంచేందుకు చెన్నై గిండీలోని సెంట్రల్ లెదర్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ (సీఎల్‌ఆర్ఐ) 'లెదర్ మార్క్' ప్రవేశపెట్టింది. ఆయా సంస్థల ఉత్పత్తి నమూనాలను పరిశీలించి ధ్రువీకరణపత్రం అందిస్తారు. సంస్థ సంచాలకుడు శ్రీరామ్ మాట్లాడుతూ.. వివిధ రకాల పరీక్షలతో నిర్ధారించి నాణ్యంగా ఉంటే 'లెదర్ మార్క్' అందజేస్తామని చెప్పారు. అందులోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చర్మం రకం, రంగు, ముడివస్తువులు తదితరాలు తెలుసుకోవచ్చన్నారు.

'సామంత రాజుల్లా డీఎంకే నేతల పాలన'



మాట్లాడుతున్న మాజీ మంత్రి వళర్మతి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో డీఎంకే నేతలు సామంత రాజుల్లా పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి వళర్మతి ఆరోపించారు. తంజావూర్ అన్నాడీఎంకే కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. మాజీ మంత్రి వళర్మతి పాల్గొని మాట్లాడుతూ... కల్తీసారా తాగి చనిపోతే రూ.10 లక్షలు, సైన్యంలో మరణిస్తే కేవలం రూ.2లక్షలు ప్రభుత్వం పరిహారం ఇస్తుందన్నారు. ఎయిర్‌షో సందర్భంగా మెరీనా తీరంలో చనిపోయినవారికి రూ.5లక్షలు అందజేసిందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా మృతుల కుటుంబాలను పరామర్శించలేదని విమర్శించారు.

హొగినేకల్‌లో స్నానానికి నిషేధం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కావేరి నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కర్ణాటకలోని కేఆర్ఎస్, కబిని జలాశయాలకు నీటిరాక పెరిగింది. దీంతో మిగులు జలాలను దిగువకు కావేరి నదిలోకి విడుదల చేస్తున్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని కావేరి పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. దీంతో ఆదివారం సాయంత్రం ధర్మపురి జిల్లా హొగినేకల్ జలపాతానికి సెకనుకు 20 వేల ఘనపుటడుగుల నీరు చేరుతోంది. సోమవారం ఉదయం 8 గంటలకు నీటిరాక 17 వేల ఘనపుటడుగులకు తగ్గింది. జలపాతాలలో ఉద్ధృతి ఎక్కువగా ఉన్నందున రెండో రోజుగా పర్యాటకులు స్నానం చేసేందుకు, దోనెల షికారుపై అధికారులు నిషేధం విధించారు.

నటి చిత్ర మృతి కేసు వ్యవహారం: ఆమె భర్త జవాబివ్వాలి: హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: నటి చిత్ర మృతికేసులో ఆమె భర్త హేమనాథ్ విడుదలకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీల్‌పై జవాబివ్వాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. బుల్లితెర నటి చిత్ర 2020లో తిరువళ్లూరులోని హోటల్‌లో మృతిచెంది కనిపించింది. హేమ్‌నాథ్ సహా ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తగిన ఆధారాల్లేవని తిరువళ్లూరు మహిళా కోర్టు హేమనాథ్‌ను విడుదల చేసింది. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా చిత్ర తండ్రి కామరాజ్ తరఫున మద్రాసు హైకోర్టులో అప్పీల్ దాఖలైంది. సోమవారం విచారణకు వచ్చింది. హేమనాథ్ జవాబివ్వాలని న్యాయమూర్తి ఉత్తర్వులు ఇచ్చి విచారణను నవంబరు 5కు వాయిదా వేశారు.

ఉపా చట్టం కింద అరెస్టయిన వారిని విడుదల చేయాలి: తిరుమా

సైదాపేట, న్యూస్‌టుడే: ఉపా చట్టం కింద అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ డిమాండ్ చేశారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. పదేళ్ల జైలు జీవితం అనంతరం బయటకొచ్చిన మాజీ ప్రొఫెసర్ సాయిబాబా పోలీసుస్టేషన్‌లో అనుభవించిన చిత్రహింసల కారణంగా పలు అనారోగ్య సమస్యలకు గురై మృతి చెందాడని తెలిపారు. ఆయనలానే అబద్ధపు ఆరోపణలతో పలువురు ఉపా చట్టం కింద అరెస్టయ్యారన్నారు. వారిని కేంద్రప్రభుత్వం విడుదల చేయాలన్నారు.

పీఎంకే బహిరంగ సభలు వాయిదా

సైదాపేట, న్యూస్‌టుడే: మూడు నగరాల్లో జరగాల్సిన బహిరంగ సభలు వాయిదా వేస్తున్నట్లు పీఎంకే ప్రకటించింది. దీని గురించి పీఎంకే అధిష్ఠానం విడుదల చేసిన ప్రకటనలో... డీఎంకే ప్రభుత్వ పాలనకు నిరసనగా 17, 20, 26 తేదీల్లో వడలూరు, దిండివనం, సేలంలో భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు పార్టీ వ్యవస్థాపకులు రామదాస్ ప్రకటించారని, అయితే రాష్ట్రానికి అతి భారీ వర్ష సూచన ఉండటంతో సభలు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. డిసెంబర్‌లో నిర్వహిస్తామని పేర్కొంది.

కోవై విమానాశ్రయంలో దిగిన కోజికోడ్ విమానం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: దుబాయ్ నుంచి కేరళ రాష్ట్రం కోజికోడ్‌కు ఫ్లై సంస్థకు చెందిన విమానం సోమవారం బయలుదేరింది. కోజికోడ్‌లో మేఘాలు దట్టంగా కమ్ముకోవడంతో విమానం ల్యాండ్ కాలేకపోయింది. దీంతో అరగంటపాటు ఆకాశంలో చక్కర్లు కొట్టడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సూచనల మేరకు విమానం కోవై విమానాశ్రయంలో దిగింది.



కళాకారులకు జ్ఞాపిక అందజేస్తున్న అతిథులు

కర్రసాము కళాకారుల సంక్షేమ సంఘ వార్షికోత్సవం

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరుత్తణి కర్రసాము, డమరుకం కళాకారుల సంక్షేమ సంఘ వార్షికోత్సవం సోమవారం సంఘ అధ్యక్షుడు ఆంజనేయన్ నేతృత్వంలో జరిగింది. స్థానికంగా ఉన్న ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో నాదస్వరం కళాకారులు పాల్గొని కచేరి నిర్వహించారు. తిరువళ్లూర్ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంద్రన్, డీఎంకే కార్యవర్గ సభ్యుడు భూపతి కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు.

పొన్ మాణిక్కవేల్‌కు బెయిల్ షరతులు సడలింపు

ప్యారిస్, న్యూస్‌టుడే: విగ్రహాల అక్రమ రవాణా కేసులో మాజీ ఐజీ పొన్ మాణిక్కవేల్‌కి ముందస్తు బెయిల్ షరతులను మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం సడలించింది. విగ్రహాల అక్రమ రవాణాకు సంబంధించి విగ్రహాల అక్రమ రవాణా నియంత్రణ విభాగం మాజీ ఐజీ పొన్ మాణిక్కవేల్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో మదురై ధర్మాసనం ఆయనకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. నాలుగు వారాలపాటు ఆయన సీబీఐ కార్యాలయంలో హాజరై సంతకం చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో షరతులను సడలించాలని కోరుతూ పొన్ మాణిక్కవేల్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా పిటిషనరు తరఫున.. కోర్టు ఉత్తర్వుల మేరకు నాలుగు వారాలపాటు సంతకం చేశారని, కావున షరతులను సడలించాలని కోరారు. దీంతో షరతులను సడలిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

చెన్నైవాసులను రక్షించేందుకు చర్యలు చేపట్టాలి: రామదాస్

సైదాపేట, న్యూస్‌టుడే: వర్షాల నుంచి చెన్నై ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ తెలిపారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... శనివారం రాత్రి నుంచి కురిసిన వర్షంతో కోయంబత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలు వాననీటితో నిండిపోయాయన్నారు. పుదుకోట్టై, శివగంగై, కరూరు, విరుదునగర్ జిల్లాల్లో కూడా వరదలు ఏర్పడ్డాయని చెప్పారు. తెగిపడిన విద్యుత్ తీగలను తొక్కి ఒకే రోజు నలుగురు మృతి చెందారని తెలిపారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన సాధారణ జాగ్రత్త చర్యలు కూడా డీఎంకే ప్రభుత్వం తీసుకోలేదని ఆరోపించారు. చెన్నైలో పలు ప్రాంతాల్లో వాననీటి కాలువల పనులు ఇంకా పూర్తి కాలేదని విమర్శించారు. చెన్నైకు అతిభారీ వర్ష సూచన ఉండటంతో ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సామ్‌సంగ్ వర్కర్స్ యూనియన్ నమోదు పిటిషన్‌పై విచారణ 16న

ప్యారిస్, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లా శ్రీ పెరంబుదూర్‌లో ఉన్న సామ్‌సంగ్ వర్కర్స్ యూనియన్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ జరపనున్నట్లు మద్రాసు హైకోర్టు తెలిపింది. సీఐటీయూ అనుబంధంగా సామ్‌సంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్ పేరిట యూనియన్ ప్రారంభించి, రిజిస్టర్ చేయాలని కార్మిక సంఘాల రిజిస్ట్రార్, కార్మిక సంక్షేమశాఖ డిప్యూటీ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దానిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఎల్లన్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందులో.. కంపెనీ పేరును వర్కర్స్ యూనియన్‌కు ఉపయోగించకూడదని సామ్‌సంగ్ తరఫున వ్యతిరేకత తెలపడంతో ప్రభుత్వం రిజిస్టర్ చేయలేదన్నారు. ఈ పిటిషన్ కిందటిసారి విచారణకు వచ్చినప్పుడు ప్రభుత్వం, కార్మికసంఘాల రిజిస్ట్రార్, కార్మిక సంక్షేమశాఖ డిప్యూటీ కమిషనర్ జవాబివ్వాలని జస్టిస్ మంజుల ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జస్టిస్ మంజుల ఎదుట సోమవారం వర్కర్స్ యూనియన్ తరఫున హాజరైన లాయర్.. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు తీసుకోవాలని తెలిపారు. బుధవారం విచారించనున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.

రైలు దారి మళ్లింపు

వడపళని, న్యూస్‌టుడే: ప్రయాగరాజ్ డివిజన్‌లోని ప్రయాగరాజ్ స్టేషనులో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగు పనుల కారణంగా ఓ రైలు దారి మళ్లినట్టు దక్షిణ రైల్వే సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ◗ 12669 డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - చాప్రా గంగా కావేరి ఎక్స్‌ప్రెస్ 19న 17.40కు బయలుదేరే రైలు ఓహన్ క్యాబిన్, బీమ్‌సేన్, కాన్పూర్ సెంట్రల్, జంఘాయ్, వారణాసి మీదుగా నడుస్తుంది.

పేదలను ఆదుకోవాలి : టీటీవీ

సైదాపేట, న్యూస్‌టుడే: వర్షాలతో ప్రభావితమయ్యే పేద ప్రజలను ఆదుకోవాలని ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాలకు అతి భారీ వర్ష సూచన ఉండటంతో పార్టీ నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులు భద్రంగా ఉండాలని సూచించారు. ఏటా రుతుపవనాల సమయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యానికి ఇది నిదర్శనమని చెప్పారు. కావున పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు సురక్షితంగా ఉండటంతో పాటు తమతమ ప్రాంతాల్లో వర్షంతో ప్రభావితమయ్యే పేదలకు తమవంతు సాయమందించాలని సూచించారు.

వైభవంగా వడాయతి ఉత్సవాలు



వెండి కేడియంపై కన్యకా పరమేశ్వరి

ప్యారిస్, న్యూస్‌టుడే: జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ముగిశాక వడాయతి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. తొలిరోజైన సోమవారం అమ్మవారికి త్రికాల అభిషేకాలు, అలంకరణలు, ఆరాధనలు చేశారు. సాయంత్రం మూలమూర్తిని బంగారు ఆభరణాలతో, ఉత్సవమూర్తిని వెండి కేడియంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శివరంజని సభ్యుల బృందగానం భక్తిభావాన్ని పెంచింది. సోమవారం ఉత్సవానికి దోమా వెంకటశేషయ్య గుప్తా కుమారులు ఉభయదారులుగా వ్యవహరించారు. పాలకమండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మూడు రోజులపాటు మెట్రో సర్వీసుల పెంపు

వడపళని, న్యూస్‌టుడే: వాతావరణ శాఖ 15, 16, 17 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించిన నేపథ్యంలో సీఎంఆర్ఎల్ సర్వీసుల సంఖ్య పెంచుతున్నట్టు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ మేరకు తెల్లవారుజామున 5 నుంచి రాత్రి 11 వరకు అన్ని టెర్మినళ్ల నుంచి నడుస్తాయి. ఉదయం 8 నుంచి 11, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 వరకు గ్రీన్ లైన్ (పురట్చి తలైవర్ డాక్టర్ ఎంజీ రామచంద్రన్ సెంట్రల్ మెట్రో నుంచి సెయింట్ థామస్ మౌంట్ మెట్రో)లో ప్రతి 5 నిమిషాలకొక సర్వీసు, బ్లూ లైన్ (ఎయిర్‌పోర్ట్ నుంచి వింకోనగర్ డిపో)లో ప్రతి 6 నిమిషాలకొక సర్వీసు, వాషర్‌మెన్‌పేట్ మెట్రో, అరిజ్ఞర్ ఆలందూరు మెట్రో స్టేషన్ల మధ్య ప్రతి 3 నిమిషాలకో సర్వీసు ఉంటుంది.

- తెల్లవారు జామున 5 నుంచి 8, 11 నుంచి సాయంత్రం 5, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు బ్లూలైన్, గ్రీన్‌లైన్‌లో ప్రతి ఏడు నిమిషాలకొక సర్వీసు అందుబాటులో ఉంటుంది.
- గ్రీన్‌లైన్‌లో సర్వీసులు పెంచిన నేపథ్యంలో ఎంజీఆర్ సెంట్రల్ మెట్రో నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు వయా కోయంబేడు, వడపళని వరకు పైన తెలిపిన తేదీల్లో తాత్కాలికంగా రద్దు చేశారు. గ్రీన్ లైన్ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లాలనుకునే ప్రయాణికులు అరిజ్ఞర్ ఆలందూరు మెట్రో స్టేషనులో ఇంటర్‌చేంజ్ కావాల్సి ఉంటుంది. వాతావరణ పరిస్థితులనుబట్టి పైన తెలిపిన సర్వీసులు యథాతథంగా కూడా నడిచే ఆస్కారముంది. వర్షాల దృష్ట్యా 15 నుంచి 17వ తేదీ వరకు సెయింట్ థామస్ మౌంట్, అరుంబాక్కం స్టేషన్లలో వాహనాలు పార్కు చేసుకోవద్దని అధికారులు సూచించారు.

పరందూర్ విమానాశ్రయానికి వ్యతిరేకంగా ఆందోళన



▸ కాంచీపురం: ఆందోళన చేస్తున్న ఏకనాపురం గ్రామస్థులు ▸ తిరుత్తణి: న్యాయవాదులు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం సమీప పరందూర్‌లో నూతన విమానాశ్రయ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను భూసేకరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. విమానాశ్రయం ఏర్పాటును వ్యతిరేకిస్తూ 14 గ్రామాల ప్రజలు 800 రోజులుగా అనేక పోరాటాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా సోమవారం పరందూర్, ఏకనాపురం, నెల్వాయ్ మొదలైన గ్రామాల ప్రజలు తమ ఇళ్లపై నల్ల జెండాలను కట్టి నిరసన వ్యక్తం చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పరందూర్‌లో ఆందోళన చేపట్టారు.

పోలీసుల తీరును ఖండిస్తూ న్యాయవాదులు...

తిరుత్తణి: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణిలోని 8వ వార్డు కౌన్సిలర్ అశోక్‌కుమార్ న్యాయవాది. ఈయన ఇటీవల ఎంపీసీ రోడ్‌లోని ఓ మందుల దుకాణంలో మందులు కొనుగోలు చేసేందుకు వెళ్లారు. ఆ సమయంలో ఆ దుకాణం వద్ద ఉన్న రాధా (45) అనే మహిళను అశోక్‌కుమార్ తన సెల్‌ఫోన్‌లో ఫొటో తీశారని ఆరోపిస్తూ ఆమె కుమారులు అరుణ్ (20), బాల అశోక్‌కుమార్‌పై దాడి చేసినట్లు తెలుస్తోంది. దీనిపై అశోక్‌కుమార్ చేసిన ఫిర్యాదు తీసుకునేందుకు పోలీసులు నిరాకరించారు. రాధా కుటుంబీకులు చేసిన ఫిర్యాదు మేరకు అశోక్‌కుమార్‌తో పాటు 30 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ న్యాయవాదులు సోమవారం ఆందోళనకు దిగారు. వారితో డీఎస్పీ కందన్ చర్చలు జరిపారు.

'అముదం' దుకాణాల ఆధునికీకరణ

పెరిగిన రోజువారీ విక్రయాలు



ఆధునికీకరించిన అముదం డిపార్టుమెంటల్ స్టోర్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: అముదం దుకాణాలను ఆధునికీకరించడంతో రోజువారీ విక్రయాలు పెరిగాయి. చెన్నై గోపాలపురంలోని అముదం దుకాణంలో రోజువారీ వ్యాపారం రూ.25 వేల నుంచి రూ.2.50 లక్షలకు, అన్నానగర్‌లోని దుకాణంలో రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు సాగుతోంది. పౌరసరఫరాల శాఖ గృహాలకు అవసరమైన కిరాణా వస్తువులతో పాటు అన్ని వస్తువులను బయటి మార్కెట్ ధర కన్నా తక్కువకు విక్రయించడానికి 'అముదం' పేరుతో డిపార్టుమెంటల్ స్టోర్లను నిర్వహిస్తోంది. చెన్నైలో 17, కడలూర్‌లో 2 దుకాణాలున్నాయి. ఇవిగాక రాష్ట్రవ్యాప్తంగా 'అమ్మ అముదం' పేరుతో 61 మినీ దుకాణాలు పనిచేస్తున్నాయి. చాలా ఏళ్ల క్రితం ప్రారంభించిన ఈ దుకాణాలు అధ్వానంగా, అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో వినియోగదారుల సంఖ్య తగ్గింది. పలువురికి ఈ దుకాణాలు ఉన్నట్లు కూడా తెలియడం లేదు. దీంతో 'అముదం' దుకాణాలను పునరుద్ధరించాలని ఆహారశాఖ తీర్మానించింది. ఆ మేరకు మొదటి విడతగా చెన్నై గోపాలపురం, అన్నానగర్‌లోని దుకాణాల్లో ఏసీ సౌకర్యం కల్పించి అందంగా తీర్చిదిద్దారు. అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. ప్రముఖ సంస్థల ఉత్పత్తులపై ఎంఆర్‌పీ ధరకన్నా 5 నుంచి 55 శాతం వరకు రాయితీ కల్పిస్తున్నారు. దీంతో వినియోగదారుల ఆదరణ పెరిగింది. గోపాలపురంలోని దుకాణంలో రోజువారీ వ్యాపారం రూ.25 నుంచి రూ.2.50 లక్షలు, అన్నానగర్ దుకాణంలో రూ.20 నుంచి రూ.2 లక్షలు పెరిగింది. చెన్నై నగరంలోని అన్ని దుకాణాలను త్వరలో పునరుద్ధరించడానికి ఆహారశాఖ చర్యలు చేపట్టింది.

ఎన్నెల్సీ ఒప్పంద కార్మికులతో

బోనస్ చర్చలు విఫలం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఎన్నెల్సీలోని శాశ్వత సిబ్బందితో సమానంగా ఒప్పంద కార్మికులకు బోనస్ ఇవ్వాలని కోరుతూ పుదుచ్చేరిలోని సహాయ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఒప్పంద కార్మికులు సమ్మె ప్రకటించారు. కడలూర్ జిల్లా నైవేలిలోని ఎన్నెల్సీలో ఉద్యోగులకు సంస్థ దీపావళి బోనస్ కింద రూ.1.50 లక్షలు ప్రకటించింది. ఒప్పంద కార్మికులకు 8.33 శాతంగా నెల వేతనం రూ.20,908 బోనస్‌గా ఇస్తామని చెప్పింది. దీన్ని ఒప్పంద కార్మికులు వ్యతిరేకించారు. చెన్నైలోని కేంద్ర కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్‌కు నిరవధిక సమ్మె నోటీసు ఇచ్చారు. ఆ మేరకు పుదుచ్చేరి రెడ్డియార్‌పాళ్యంలోని కేంద్ర కార్మిక శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో సోమవారం చర్చలు జరిగాయి. సహాయ కమిషనర్ రమేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన చర్చల్లో ఎన్నెల్సీ యాజమాన్యం తరపున అసిస్టెంట్ చీఫ్ మేనేజర్ సతీష్‌కుమార్, సీఐటీయూ జనరల్ కాంట్రాక్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున అధ్యక్షుడు పళనిసామి, ప్రధాన కార్యదర్శి అమృతలింగం తదితరులు పాల్గొన్నారు. అమృతలింగం మాట్లాడుతూ 17న ప్రదర్శన నిర్వహిస్తామని, డిమాండ్ నెరవేర్చకపోతే సమ్మెలోకి వెళతామని ప్రకటించారు.

ఆలయాల్లో వసతులు ప్రారంభం



వీసీ ద్వారా ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ తరపున తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయం, ఉభయ ఆలయాలైన కృష్ణాపురం, వెంకటాచలపతి ఆలయంలో రూ.5.81కోట్లతో తెప్పకుళం పునరుద్ధరణ, వేదపాఠశాల, అన్నదాన సముదాయం, విద్యుత్ దీపాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. రూ.68.36కోట్లతో కొత్తగా నిర్మించిన భక్తుల వసతి భవనం, మండపం, నీటితొట్టెల తదితరవాటిని కూడా వీసీ ద్వారా ప్రారంభించారు. దేవాదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు, ఎంపీ కనిమొళి, ప్రధాన కార్యదర్శి మురుగానందం తదితరులు వెంట ఉన్నారు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా వైద్య శిబిరాలు

టీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1000 వైద్య శిబిరాలు మంగళవారం నిర్వహించనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ పేర్కొన్నారు. సోమవారం సేలం ప్రభుత్వ మోహన కుమారమంగళం వైద్య కళాశాలలో రూ.23.75 కోట్లతో 50 పడకల అత్యవసర చికిత్స విభాగానికి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

భయాందోళనలో ప్రజలు: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాల వర్షాలను ఎదుర్కొనేందుకు సిద్ధమని ప్రభుత్వం చెప్పినా ప్రజలు భయాందోళనల్లో ఉన్నారని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం తెలిపారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... వర్షాలకు ముందే జలవనరుల్లో పూడిక తీయడం, వాననీటి కాలువల నిర్మాణ పనులు పూర్తి చేయడం ప్రభుత్వ బాధ్యతన్నారు. ఆ ప్రకారం అన్ని పనులు పూర్తయ్యాయని, వర్షాలను ఎదుర్కొనేందుకు సిద్ధమని ప్రభుత్వం తెలిపిందన్నారు. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని విమర్శించారు. చెన్నై, చుట్టుపక్కల ప్రాంతాల్లో వాననీటి కాలువల పనులు పూర్తి కాలేదని, పలు ప్రాంతాల్లో గుంతలు పూడ్చలేదని ఆరోపించారు. దీంతో ప్రజలు ఆందోళనతోనే ఉన్నారని తెలిపారు. కావున ప్రజలను వరద ప్రమాదం నుంచి రక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



అలంకరణలో అమ్మవారు

చెన్నై జీఎన్ శెట్టి రోడ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ పవిత్రోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి అంకురార్పణ జరిగింది. తాయారు ఉత్సవమూర్తి వద్ద వేద పండితులు అంకురార్పణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తితిదే చెన్నై విభాగ ఏఈఓ పార్థసారధి, తాయారు ఆలయ సూపరింటెండెంట్ పుష్పలత, తితిదే స్థానిక సలహా మండలి మాజీ అధ్యక్షుడు శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- టీనగర్, న్యూస్‌టుడే

కనులపండువగా రథోత్సవం



ఉత్సవంలో పాల్గొన్న భక్తజనం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: మణలిపుదునగర్ వైకుంఠపురంలోని అయ్య వైకుంఠ ధర్మపతి ఆలయంలో ఈనెల 4న పెరటాసి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ప్రతిరోజు స్వామి వారు వివిధ వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం రథోత్సవం వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఆలయం తరపున అన్నదానం చేశారు.



ఈశాన్య రుతుపవనాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై కాంచీపురం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టరు కలైసెల్వి - కాంచీపురం, న్యూస్‌టుడే

రేషన్ దుకాణాల్లో తనిఖీ

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: గుమ్మిడిపూండి తాలూకాలోని రేషన్ దుకాణాల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ మేరకు ఎమ్మెల్యే గోవిందరాజన్ కవరప్పేట, పుదువాయల్, పెరువాయల్, కీళ్ ముదలంబేడు, మేల్‌ముదలంబేడు ప్రాంతాల్లోని చౌక దుకాణాల్లో సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సరకుల నిల్వల వివరాలు సేకరించారు. తూనికలు, సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. కొనుగోలుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



బియ్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరాజన్

పాఠశాలలకు బాంబు బెదిరింపు



▸ అరక్కోణం: పాఠశాల ఆవరణలో బాంబు స్క్వాడ్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ▸ విల్లివాక్కం: హోటల్ ప్రాంగణంలో తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట సిప్కాట్ సమీపంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) ఆవరణలో డీఏవీ సీబీఎస్‌ఈ పాఠశాల ఉంది. ఈ పాఠశాలకు సోమవారం అశ్వినీ కరుణానిధి అనే మెయిల్ ఐడీ నుంచి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరమురుగన్ ఈ-మెయిల్‌కు పాఠశాలలో బాంబు పెట్టినట్లు బెదిరింపు సందేశం వచ్చింది. ఆయన వెంటనే జిల్లా యంత్రాంగానికి, పోలీసులకు సమాచారం అందించారు. రాణిపేట డీఎస్పీ, పోలీసులు, బాంబు స్క్వాడ్ పాఠశాలకు చేరుకుని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఎలాంటి పేలుడు వస్తువులు లభించలేదు. బెదిరింపులు వచ్చిన ఈ-మెయిల్ గురించి దర్యాప్తు జరుపుతున్నారు.

ఊటీలోని హోటళ్లకు... విల్లివాక్కం: నీలగిరి జిల్లా కున్నూర్‌లోని స్టేన్స్ ప్రైవేట్ పాఠశాలకు రెండోసారి సోమవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. పాఠశాలకు సెలవు ప్రకటించి విద్యార్థులను బయటికి పంపారు. ఊటీలోని నాలుగు స్టార్ హోటళ్లకు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. జాగిలాలు, బాంబ్ స్క్వాడ్‌తో పోలీసులు హోటళ్లు, కున్నూర్ పాఠశాలలో తనిఖీ చేశారు. ఎలాంటి పేలుడు వస్తువులు లభించలేదు.

తాటిచెట్లు నరికిన

దుండగులు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప పూంజోలైనగర్ చిన్నమపేట గ్రామ పొలిమేరలో సుమారు 80 ఏళ్ల వయసున్న వందకుపైగా తాటిచెట్లు ఉన్నాయి. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి 40 చెట్లను నరికి వేశారు. సోమవారం ఉదయం వాహనాల్లో తరలించేందుకు యత్నించగా స్థానికులు వచ్చేసరికి పారిపోయారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు తిరువేలాంగాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భూగర్భ జలాలు పుష్కలంగా ఉండాలని గతంలో గ్రామ పెద్దలు తాటి విత్తనాలు నాటారని, ఇటుక బట్టీల్లో వినియోగించుకునేందుకు చెట్లను నరికిన దుండగులపై కఠిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.



24 గంటలూ వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉండాలి: ఆరోగ్యశాఖ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రుతుపవన వర్షాలను ఎదుర్కొనేలా 24 గంటలూ వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ వాహనాలు సిద్ధంగా ఉండాలని ఆరోగ్యశాఖ ఆదేశించింది. ఈ మేరకు శాఖ డైరెక్టర్ సెల్వవినాయగం జిల్లా అధికారులకు లేఖ పంపారు. అందులో.. లోతట్టు ప్రాంతాలకు అత్యవసరమైన మందులతో సిబ్బంది వెంటనే వెళ్లాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు, శుభ్రమైన వెంటిలేషన్ ఉండేలా చూడాలన్నారు. ఆస్పత్రుల్లో మందులు, టీకాలు, పడకలు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. విద్యుత్తు అంతరాయం కలగకుండా జనరేటర్లు సిద్ధం చేయాలన్నారు. జ్వరాలు, చిన్నపాటి గాయాలు, చర్మసంబంధిత వ్యాధులకు వెంటనే చికిత్స అందించాలన్నారు. నీటిలో మునిగినవారికి, పాము, ఇతర విష పురుగులు కుట్టినవారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రేషన్‌కార్డుల్లో సవరణకు ప్రత్యేక శిబిరం 19న

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు జిల్లాలోని రేషన్‌కార్డుదారులు తమ కార్డుల్లో చిరునామా, పేర్ల మార్పు, కొత్త పేర్ల నమోదుకు సంబంధించి ఈనెల 19న ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రాణిపేట జిల్లాలో భారీ వర్షాలు

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా వాలాజాపేట, ఆర్కాడు, నెమలి, అరక్కోణం, పరిసర ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయం అయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

జాలర్ల వలలో చిక్కిన భారీ తాబేలు



తాబేలును సముద్రంలోకి వదులుతున్న దృశ్యం

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా చదురంగపట్నం ప్రాంతంలోని మత్స్యకారులు ప్రేమ్‌కుమార్, రాహుల్ రామరాజ్ తదితరులు ఆదివారం సముద్రంపైకి చేపల వేటకు వెళ్లారు. వీరి వలలో భారీ తాబేలు చిక్కింది. దాన్ని పడవలోకి ఎక్కించి తీరానికి తీసుకొచ్చి దాని కాళ్లకు తగులుకున్న వలను కత్తిరించి శుభ్రం చేశారు. తరువాత అదే పడవలో తీసుకెళ్లి సముద్రంలో వదిలేశారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది.

షవర్మా తిన్న ఐదుగురికి అస్వస్థత

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుకోట్టైలో ఆదివారం షవర్మా తిని ఒకే కుటుంబంలో ఏడేళ్ల బాలుడు సహా ఐదుగురు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. పాడైన చికెన్ ఉపయోగించారనే ఫిర్యాదు రావడంతో సదరు దుకాణంలో ఆహార భద్రతాశాఖ అధికారులు సోదాలు జరిపారు. షవర్మాలో పాడైన చికెన్ వాడినట్లు తెలియడంతో దుకాణానికి అధికారులు సీల్ వేశారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ఇద్దరు కార్మికుల మృతి

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: గుమ్మిడిపూండి సమీప కొత్తగుమ్మిడిపూండిలో ప్రైవేటు ఉక్కు కర్మాగారం ఉంది. ఇందులో కొత్త భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మిథున్‌మండల్ (31), దెబసీయయునా (25) ఆదివారం సాయంత్రం నిర్మాణ పనుల్లో ఉండగా పైన వేలాడుతున్న విద్యుత్తు తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలిలోనే మృతి చెందారు. సిప్కాట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవరు, క్లీనర్...

ఆర్కేనగర్: తంజావూర్ జిల్లా కుంభకోణం సమీప గోవిందపురం నుంచి పువ్వుల లోడుతో ఓ మినీ లారీ సోమవారం ఉదయం కుంభకోణానికి బయలుదేరింది. మార్గమధ్యలో ఎదురుగా వచ్చిన కళాశాల బస్సుని వేగంగా ఢీకొనడంతో లారీలోని డ్రైవర్, క్లీనర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బస్సులో ఉన్న 20మందికిపైగా కళాశాల విద్యార్థులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు కుంభకోణం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నదిలో పడి రైతు...




పెరియసామి (పాతచిత్రం)

విల్లివాక్కం: నామక్కల్ జిల్లా తిరుచెంగోడు సమీప ఎలచ్చిపాలయం-కొన్నైయార్ మార్గంలో తిరుమణిముత్తారు నది ప్రవహిస్తోంది. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నదిలో ప్రవాహం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో కొన్నైయార్ అరసడిక్కాట్టుకు చెందిన రైతు పెరియసామి (58) సోమవారం వేకువజామున నదిపై ఉన్న వంతెనపై పొలానికి వెళ్లేందుకు నడిచి వెళ్తున్నాడు. ఆ సమయంలో నదిలో నీరు వంతెనపైకి దూసుకురావడంతో నదిలోపడి కొట్టుకుపోయాడు. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని గాలించి మృతదేహాన్ని వెలికితీశారు.

అధిక మోతాదులో మాత్రలు వేసుకున్న కూలీ...

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు సమీప తలకంజేరికి చెందిన విశ్వనాథన్ (57) రైతు కూలీ. ఇతను మధుమేహంతో బాధపడుతున్నాడు. వైద్యుల సూచన మేరకు మాత్రలు వేసుకుంటున్నాడు. ఆదివారం రాత్రి అధిక మోతాదులో మాత్రలు వేసుకోవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబీకులు తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలను బావిలో పడేసి తల్లి ఆత్మహత్య



సంగీత, అదియమాన్ (పాతచిత్రాలు)

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ జిల్లా పేర్నంబట్టు సమీప గౌరపేటకు చెందిన ప్రేమ్‌కుమార్ చెన్నైలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య సంగీత (26), కుమారుడు అదియమాన్ (5), రెండేళ్ల పాప ఉంది. సంగీత సోమవారం ఉదయం గ్రామ పొలిమేరలోని తన పొలానికి ఇద్దరు పిల్లలతో వెళ్లింది. అక్కడున్న బావిలో కుమారుడు, కుమార్తెను పడేసి తానూ దూకేసింది. అక్కడున్న రైతు కూలీలు గమనించి పాపను కాపాడి ఆసుపత్రికి తరలించారు. సంగీత, అదియమాన్ మునిగి మృతి చెందారు. పోలీసులు మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టానికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల చోరులు అరెస్టు



నిందితులను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా తాంబరం సమీప పెరుంగళత్తూర్‌కు చెందిన విజయేంద్రన్ నాలుగు రోజుల క్రితం తాంబరంలోని ఓ వస్త్ర దుకాణానికి వెళ్లి అక్కడ తన బైక్ నిలిపి లోనికివెళ్లాడు. దుస్తులు కొనుగోలు చేసి వచ్చి చూడగా అతని వాహనం కనిపించలేదు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరుసటిరోజు ఉదయం తాంబరం షణ్ముగం రోడ్డులో ఓ దుకాణం ఎదుట ఆపి ఉన్న ద్విచక్ర వాహనం అదృశ్యమైంది. వాహన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఈ ఘటనలపై దర్యాప్తు చేపట్టారు. ఓ యువకుడు వాకింగ్ స్టిక్‌తో ఒంటరిగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని తన వద్ద ఉన్న తాళాలతో స్టార్ట్ చేసి తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. చోరీకి పాల్పడిన యువకుడు బన్రుట్టి ప్రాంతానికి చెందిన నమ్మ అప్పు అలియాస్ అమ్మనార్ (29)గా గుర్తించారు. ప్రత్యేక పోలీస్ బృందం అయ్యనార్‌ను అరెస్టు చేసింది. అతని వద్ద జరిపిన దర్యాప్తులో.. అతను పాలయంకోట జైలులో ఉన్నప్పుడు దిండివనానికి చెందిన విజయ్ (20) అనే ఖైదీతో స్నేహం ఏర్పడిందని, ఇద్దరూ జైలు నుంచి విడుదలై వాహనాల చోరీలకు పాల్పతున్నట్లు తెలియడంతో పోలీసులు దిండివనం వెళ్లి విజయ్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తాంబరం కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

బైక్ రేస్‌లో పాల్గొన్న 15 మంది...



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

మహాబలిపురం: చెన్నై ఈసీఆర్ ముట్టుక్కాడు ప్రాంతంలో ప్రజలను భయాందోళనకు గురిచేసేలా కొందరు యువకులు ఆదివారం సాయంత్రం బైక్ రేస్ నిర్వహించినట్లు పళ్లికరణై ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ కరుణాకరన్‌కు సమాచారం అందింది. ఆ మేరకు కమిషనర్ నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక పోలీసు బృందం ముట్టుక్కాడు ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. అప్పుడు ఈసీఆర్‌లో వేగంగా ద్విచక్ర వాహనాలను నడుపుతున్న 15 మంది యువకులను అరెస్టు చేశారు. వారి నుంచి ఖరీదైన బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు.

గుట్కా విక్రేతలు నలుగురు...

శ్రీపెరుంబుదూర్: జిల్లాలోని పడపై సమీప ఒరగడం ప్రాంతంలోని దుకాణాల్లో స్థానిక పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓ దుకాణంలో గుట్కా నిల్వ ఉంచిన రాజలింగాన్ని అరెస్టు చేశారు. సింగపెరుమాళ్ కోవిల్ ప్రాంతంలోని కిరాణా కొట్టు నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు చెప్పడంతో అక్కడా తనిఖీలు చేపట్టారు. యజమాని తాజుద్దీన్, అతని కుమారుడు అసార్‌ను అరెస్టు చేసి రూ.40 వేల విలువైన గుట్కా, ఇతర మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. శ్రీపెరుంబుదూర్ సమీప శివన్ తాంగళ్ గ్రామంలో నిల్వ ఉంచిన రూ.30 వేల విలువైన గుట్కా స్వాధీనం చేసుకొని రామరాజన్‌ను అరెస్టు చేశారు.

నకిలీ నగలు తాకట్టు పెట్టి మోసం

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై రాయపేట లాయిడ్స్ రోడ్డులో సీతారామ్ అనే వ్యక్తి బంగారు నగల కుదువ దుకాణం నిర్వహిస్తున్నారు. కొన్ని నెలలుగా ఇద్దరు వ్యక్తులు అతని దుకాణంలో బంగారు నగలు తాకట్టు పెట్టి తిరిగి తీసుకెళ్తుండటంతో వారితో అతనికి సాన్నిహిత్యం పెరిగింది. రెండు నెలల క్రితం వారు బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.2.06 లక్షలు తీసుకున్నారు. కొన్ని రోజుల తర్వాత సీతారామ్ కుదువ పెట్టిన నగను సరిచూడగా అవి నకిలీవిగా తెలిసింది. దీంతో రాయపేట పోలీసులకి ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి సోనల్, బింటును అరెస్టు చేశారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించారు.